# విషచక్రంలో అనసూయ

నల్లని మేఘాలకి మెరుగంచైనా వుంటుంది. కాని కొందరి జీవితాలకి ఆ మాత్రం వుండదు. విచిత్రం ఏమిటంటే అటువంటి వ్యక్తులే నిత్యం, ప్రతి నిత్యం సౌఖ్యాన్వేషణలో మునిగి తేలుతూ వుండడం. చూసేవారికి అనిపిస్తుంది. నువ్వు నష్టజాతకుడివి. నీ జీవితంలో అదృష్టం అనేది లేదు. వెలుగనేది లేదు. ఆ సంగతి మా కందరికి తెలిసిందే, నీ కెందుకు తెలియడం లేదు? యిప్పటికేనా అటువంటి అన్వేషణ మాని ఎలాగో అలా బ్రతికేయడం నేర్చుకో! అని చెపుదామని. అయినా మన వెర్రి గాని మనం చెప్పినంత మాత్రాన్ని వింటారా?

* * *

కొందరి జీవితగాథలు నిజంగా కథల్లాగే వుంటాయి. అవే కథల్లో చెప్పినా వాస్తవికత లోపించి అతిశయోక్తిగా తోస్తుంది చాల మందికి. అయినా అవి నిజాలే. ఆ జీవిత వలయాలలో చిక్కుకుని ఉక్కిరి బిక్కిరి అయి చివరికి నిస్పృహతో జీవితం నింపుకొన్నా - దేనికోసమో బ్రతికే వ్యక్తులు మనకి నిత్యజీవితంలో కనబడుతూనే వుంటారు. వీరే కనుక మన కళ్ళబడకుంటే వారి జీవితాలు మనకి అబద్ధాలుగా అభూతకల్పనలుగా అనిపించక తప్పదు. అప్పుడే అని పిస్తుంది, యీ ప్రపంచంలో అసలైన నిజాలు ఎంత అబద్ధంగా కనిపిస్తాయి! అని.

అలల తాకిడికి, ఒరపిడికి తట్టుకొని నిలబడిన దీప స్తంభంలా ఎన్ని కష్టాలనైనా సరే నిలువుగా నిల్చుని ధైర్యంగా ఎదుర్కోగలను అనుకుంది అనసూయ. ప్రశాంతంగా వున్న నీట రాయి విసరితే ఏర్పడ్డ వలయాల సమూహాలు పెరిగి పెరిగి చివరికి తిరిగి ప్రశాంతత ఏర్పడ్డట్లే తన జీవిత సరస్సులోనూ రాయిపాటువల్ల ఏర్పడ్డ కష్టాల వలయాలు విస్తృతం అయిఅయి చివరికి ప్రశాంతం తిరిగి ఏర్పడుతుందన్న ధీమాతో ధైర్యంగా వుండకల్గింది అనసూయ. కాని ఆ ధైర్యం ఏమయింది? నిబ్బరం ఏమయింది? అనసూయ జీవిత వలయాల తాకిడికి నిబ్బరంగానైనా నిలువలేని అర్భకురాలు ఎలా అయిపోయింది? జీవితాన్ని ఎలాగైనా సరే సౌఖ్యపూరితం చేసుకోవాలి, చేసుకోగలను అన్న ధైర్యంతో మెరిసే అనసూయకళ్ళు నిస్పృహతో, నిరాశతో, ఎలా వెలితిగా తయారయాయి?

గాలి తాకిడికి వంగి నేల కరచిన గడ్డిపోచ తిరిగి నిట్ట నిలువుగా నిలబడదా! దూర దూరాలనుండి దూసుకుని వచ్చే ప్రియవచనాలు ప్రతిధ్వనులు నాకు కాకుండా యెవరేనా చెయ్యకలరా? అంటారు. అనిఅడుగుతారు. కాని... అది గడ్డిపోచ కనుక గాలిపాటుకి వంగినా తిరిగి నిలిచింది. కాని ఉడుకునెత్తురు శరీరంలో ప్రవహించే మనిషి అలా చెయ్యగలడా? అలా చెయ్యకలగడమే నా విధి అని మనం విధించడం భావ్యమా? ఆత్మాభిమానం యెన్నిసార్లు చంపుకోమంటారు? దూరాలనుండి ప్రియవచనాలను మోసుకుని వచ్చే ప్రతిధ్వనులు సమకూర్చే తృప్తి ఏపాటిది? ఎంతకాలం

నిలుస్తుంది. అందువల్ల చిక్కే మనశ్శాంతి కంటే ఆందో
ళనా, అశాంతే ఎక్కువ కదా?

* * *

నిన్ను ఎవరు యిక్కడికి తీసుకువచ్చారు? అసలు నువ్వు
ఎక్కడిదానివి? అని ప్రశ్నలు వర్షంలా కురిపిస్తుంటే నేల
కరచిన దృష్టులతో నిలచింది అనసూయ. అవును. తనెక్కడిది?
ఎక్కడికి వచ్చింది? ఎవరిఎదుట చివరికి నిల్చింది? అన్న
ఆలోచన రాగానే కళ్ళు వర్షించాయి. తనమీద ఎవరికేనా
సానుభూతి కల్గుతుందన్నాకూడ నమ్మకం లేదు. అయినా
అలాంటి సానుభూతికోసం సహాయంకోసం ఎదురుచూస్తూ
యిక్కడికి వచ్చింది.

అనసూయ మర్యాదస్తుల యింటి ఆడపిల్ల. చదువు
సంధ్యలు హైస్కూలుతో ఆగిపోయినా యింగితజ్ఞానం కల
పిల్ల. కన్నూ ముక్కూ తీరు చూపరుల దృష్టిని ఆకర్షించే
అందమైన పిల్ల అనసూయ. తండ్రి ఛాందసుడు. ఎనిమిదో
ఏట శాస్త్రయుక్తంగా పిల్లపెళ్ళి జరిపించలేకపోయానే అని
యీనాటికీ బాధపడేటంతటి ఛాందసుడు. అదేం కర్మమో,
పెళ్ళి సంబంధాలు వెతకడంలో అత్రుత హెచ్చించిన కొద్దీ
అనసూయ పెళ్ళి వెనకపడింది. తండ్రి ప్రాణం విసిగింది.
అందం ఏం చేసుకుంటాం? యింగితజ్ఞానం ఏం చేసుకుంటాం?
అందుకే కట్నం ఏమాత్రం అని అడిగే పెళ్ళికొడుకుల పెద్ద
లతో పడలేక, చూసి చూసి కూతురుగొంతుకా కొయ్య
లేక కాలం గడిపాడు అనసూయ తండ్రి. అనసూయకి పద్దె
నిమిదేళ్ళు వచ్చి వెళ్ళాయి. అలాగే యిరవై ఒకటీ దాటింది

కాని కల్యాణ ఘడియలు రాలేదు. చివరికి ప్రాణం విసిగిన తండ్రి రెండో పెళ్ళిసంబంధం నిశ్చయించాడు. నలభై సంవత్సరాలు పెళ్ళికొడుక్కి. పిల్లల ముచ్చట ముందే తీరే లాంటి ముగ్గురు రత్నంల్లాంటి పిల్లలు. తండ్రికి అంతా నచ్చే నిశ్చయించేశాడు. ఎవరూ చూడకుండా ఆ తండ్రి తుడుచుకున్న కన్నీళ్ళకేం గాక!

అయితే అనసూయ ఒప్పుకుందా?... ఆ సంగ తెవరిక్కావాలి? తండ్రి సంబంధాలు చూస్తూనే వున్నాడు. ఆ మధ్యలో అనసూయ తన హృదయాన్ని ఓ చిన్నవానికి ధారాదత్తం చేసింది. వూహల్లో స్వైర విహారంచేస్తూ గాలి మేడలు కట్టింది. చిన్నవాడికి ఉద్యోగం లేదు. అయినా ధైర్యంగా చెప్పాడు. "నువ్వు లేకుంటే అసలుండలేను. మద్రాసు పోతే ఏదో ఒక ఉద్యోగం దొరక్కపోదు, హాయిగా వుండాం. భూతలంపై స్వర్గం సృష్టిద్దాం." అనసూయ నమ్మింది. అందుకే ఆమెముఖంలో హాసరేఖలు విచ్చి ముఖం కళకళలాడింది. చెక్కిళ్ళు ఎరుపెక్కాయి. నడకలో నాట్యం, మాటలలో సంగీతం పెల్లుబికింది. యీ మార్పులు గుర్తించని తల్లి అనుకుంది: చిట్టి తల్లి తండ్రి కుదిర్చిన సంబంధంతో ఓ సంతృప్తి పడిందని. తండ్రీ అంతే అనుకున్నాడు...కాని,

కాని ఏమయింది? వారాలూ నెలలూ గడిచాయి. అనసూయ హృదయం తెలియని ఆనందంతో హద్దులు మీరి కొట్టుకుంటూంది. పెళ్ళిముహూర్తంకూడా దగ్గిరపడుతూంది.

ఒకనాటి తెల్లవారుఝామున అనసూయ తన గుడ్డలు సర్దుకొని చలిని కూడా లెక్క చెయ్యకుండా, తమ వూరి రైలుస్టేషను చేరింది. అక్కడే ఆ చిన్నవాడూ వేచి వున్నాడు. ఆ చీకట్లో అనసూయని హృదయానికి అణుచుకొని మరీ చెప్పాడు. "ఇకమీదట మనం స్వర్గం చేరబోతున్నాం" అంటూ రైలు ఎక్కారు యిద్దరూను. ఒకరి కళ్ళలో ఒకళ్ళు తప్ప వారి కింకేమీ తెలియడంలేదు. పెద్దలని యౌవనపు మదం అంటారు. చిన్నలు దాన్నే ప్రేమంటూ మురిసిపోతారు.

అప్పుడే రెక్కలు వచ్చిన పక్షులకి ఎగరటంలో ఉండే అలసట తెలియకు మద్రాసు చేరిన అనసూయకీ చిన్నవానికీ దగ్గిర వున్న డబ్బు అయిపోయేదాకా చుట్టూ ప్రపంచం గుర్తుకి రాలేదు. తరువాత చిన్నవాడు కాళ్ళు అరిగేలా మద్రాసు సినిమా స్టూడియోలచుట్టూ తిరిగాడు ఉద్యోగం కోసం!

ఉద్యోగం దొరకలేదు. అనసూయసంగతే మరచి తిరిగాడు చిన్నవాడు. అనసూయ బెంగపెట్టుకుంది. సాహసించింది. కాని ఫలితం మాత్రం శూన్యం. చిన్నవాడు తిరిగి రాలేదు. కాని హఠాత్తుగా ఒక రోజుమాత్రం వచ్చి చెప్పాడు: ఫలానా స్టూడియోలో చిన్న ఉద్యోగం లాంటిది దొరికింది. కాని అస్తమానం వచ్చి యిక్కడ కూర్చుందుకు టైమ్ వుండదు. ఇంటికి వెడతావా? చివరి ప్రశ్న వచ్చేదాకా అనసూయ స్వర్గంలో వుంది. ఆ ప్రశ్న యీ ప్రపంచంలోకి తెచ్చింది. ఏమిటి! ఇంటికి వెళ్ళడమా?

ఎందుకూ? అన్న ప్రశ్నలు ఒకదాని వెంట ఒకటి అడిగింది. సమాధానంగా చిరునవ్వు నవ్వుతూ అన్నాడు: ఎందుకేమిటీ? యిక్కడ ఒక్క రాత్రీ వుండి ఏం చేస్తావు?

"మరి నువ్వో? నిన్ను చూడకుండా ఎలా ఉండను? నన్ను చూడకుండా నువ్వు వుండ గలవా?"

"ఉండకుండా ఏం చెయ్యమన్నావు? నిన్ను చూస్తూ కూర్చుంటే కడుపు నిండుతుందా?" అంటూ అనసూయ సమాధానంకోసం ఎదురుచూడకుండా బయటకి నడిచాడు చిన్నవాడు. అనసూయ మ్రాన్పడి చూస్తూ వూరుకుంది. చిన్నవాడు గడప దాటాకే గుర్తొచ్చింది, తా నెదుర్కోవలసిన భావి. ఇంత పెద్ద పట్టణంలో ఒంటరిగా తా నేం చేయగలదు? పోనీ యింటికి పోతే? ఏ ముఖంతో మళ్ళా ఆ యిల్లు చూస్తుంది. ఆలోచనల అలల తాకిడికి నిలువలేక అనసూయ అలసి సొలసి నిద్రపోయింది. చీకటిపడ్డట్లుంది తెలివి వచ్చేసరికి. యింకా యీ ఒంటిగది భవంతిలో ఉంటే అద్దె ఎవరిస్తారు? అందుకే అనసూయ లేని ధైర్యం తెచ్చుకొని ఆ చీకట్లోకి నడిచింది. రాత్రంతా నడిచింది. ఆ గడప దగ్గిరా ఈ గడప దగ్గరా ఆగుతూ ఆగుతూ, సాగుతూ సాగుతూ, రాత్రంతా నడచింది అనసూయ. కంటికి నిద్ర రాలేదు. కడుపుకి ఆకలి కాలేదు. కాలికి అలసట రాలేదు.

తెల తెలవారుతూంటే అనసూయ ఆగిన గడప కోరుకున్నదగ్గ గడప. అది ఒక అభయ నిలయం అనీ, తన వంటి అనాథలకి ఆశ్రయం దొరుకుతుందనీ అనసూయ కలలో కూడా తలపోయలేదు. కాని ఆమెకాళ్ళు అటువంటి

దారి చూపాయి. అలసి వీధిమెట్టుమీద కూర్చొని అంతు లేని ఆలోచనలలో మునిగిన అనసూయకి గూర్ఖావాడి కేకతో తెలివివచ్చింది. "అమ్మగారు పదకొండింటి దాకా రారు. అప్పుడే యిక్కడ సిద్ధమయ్యావే!" అన్నాడు. ముందర యీ మాటలు అర్థంకాలేదు. కాని అనసూయ అడిగి తెలుసుకుంది! బ్రతుకు జీవుడా అంటూ అక్కడే కూర్చొ దలచుకుంది.

పదకొండు గంటలూ అయింది. అమ్మగారు రానూ వచ్చారు. అమ్మగారిలో అంతటి సహృదయత వుంటుందంటే నమ్మకం లేకపోయింది. కాని ఆమెతో మాట్లాడాక తెలిసింది. అందుకే యేమీ దాచకుండా సర్వం చెప్పకలిగింది అనసూయ. అమ్మగారు అనసూయకి అక్కడే వుండే ఏర్పాటులు చేశారు. అక్కడే వారాలూ నెలలూ గడిచిపోయాయి. ఒకరోజు కిటికీలో కూర్చొని కిందకి చూస్తూ ఆలోచించుకుంటున్న అనసూయకి అమ్మగారు త్వర త్వరగా రావడం కన్పించింది. తిన్నగా అనసూయదగ్గరకే వచ్చారావిడ. "యిన్నాళ్ళకి నీకు మధ్య ఆశ్రయం కల్గించ కలిగానమ్మా, అనసూయా. ఆ చిన్నవాణ్ణి కనుక్కోకలిగాం. రేపు ఇక్కడే నీకు పెళ్ళిచేస్తా" అంటూ చెప్తుంటే నమ్మకం తోచకపోయినా ఇట్టే నమ్మింది అనసూయ.

అనుకున్నట్లే మర్నాడు సిటీ రిజిస్ట్రారుముందు అమ్మగారూ, ఇంకో ఇద్దరు పెద్దలూ అనసూయ వివాహం జరిపించారు. ఆ రోజు హఠాత్తుగా వచ్చి అలా చెప్పేసి వెళ్ళిపోయి

తనని కాదన్న చిన్నవాణ్ణి, అన్నీ మరచిపోయి ఆనందంగా చేపట్టింది అనసూయ.

ఆ రాత్రి అతనిచేతుల్లో గువ్వలా యిమిడిపోతూ యీ లోకాన్నే మరిచింది "నేను నిన్ను కష్టపెట్టాను అనూ, అన్నీ మరచి పో. ఆనందంగా తిరిగి బ్రతుకుదాం" అంటూ అంటే, "నాకు జ్ఞాపకం చెయ్యకు, నాకు కావలసింది నువ్వే. నువ్వు వచ్చావు అంతే చాలు" అంటూ అతని భుజంమీద తల దాచుకొంది. రోజులు మళ్ళీ నిత్య కళ్యాణంలాగా జరిగిపోతున్నాయి. చాలీ చాలని జీతంతోనే ఎంతో హాయిగా పొందుగా కాలక్షేపంచేసుకునస్తోంది. చిన్నవాడు నిత్యం చిరునవ్వు లొలికిస్తూ అనసూయకండ్లముందు వెన్నెలలు కురిపించాడు. అదే పండుగ అనసూయకి.

అనసూయ కిప్పుడు ఆరో నెల. మరో మూణ్ణెళ్ళు నిండితే పండంటి పాపణ్ణి కంటానని కలల ప్రపంచంలో విహారిస్తోంది. ఆనంద తరంగాలమీద తేలియాడుతూన్న అనసూయకి, చిన్నవానిలో వచ్చిన మార్పులు కనిపించనేలేదు సరికదా, అతనూ తనలాగే ఆనందం పట్టలేకుండా వున్నాడని తలపోసింది.

కాని హఠాత్తుగా ఆనాటిరాత్రి అతను ఇంటికి రాని పోతే పాత సంఘటనలు సినిమారీళ్ళలా కళ్ళముందు తిరగాయి. నాకు తీరిక వుండదు.ఇంటికి వెడతావా? అన్న చిన్నవానిముఖం కనులఎదుట మసిలింది. అంతేకాదు; వెన్నంటి వేళాకోళంచేసింది. అటువంటి మనిషిని ఎలా తిరిగి నమ్మానా అని తనని తనే ప్రశ్నించుకుంది. తనెంత గుడ్డిగా

ప్రవర్తించిందో తెలిసేసరికి, యిక తిరిగి ఏం చేయాలో తెలియక పోయేసరికి, అనసూయకు అపరిమితమైన పిరికితనం తోచింది. అపును, ఒకరోజు అంత యిదిగా ప్రవర్తించిన చిన్నవాణ్ణి ఎలా నమ్మింది తను?

రాత్రంతా కళ్ళలో ఒత్తులు పెట్టుకు కూర్చుంది ఒస్తాడేమోనని. ఆ రాత్రి కాదు, మర్నాడు రాత్రి కాదు, వారం రోజులు దాటినా చిన్నవాడు రాలేదు. అనసూయ తిరిగి చిక్కి శల్యమైంది. అందాల పాపడు చేతినిండుగా వుంటాడన్న ఆనందంకోసం ఎదురుచూసేటంతటి ధైర్యం లేదు; విశ్రాంతి లేదు. ఇంక భావిని ఎదుర్కోవడం ఎలాగా అన్నది ఒక్కటే సమస్య.

సాయంత్రంపూట వున్న రెండు చీరలూ చుట్టిపెట్టి చేత పట్టుకుని అనసూయ బయలుదేరింది. ఎక్కడికి? అమ్మగారితో మొర పెట్టుకుందుకు, అభయ నిలయంలో ఆశ్రయం దొరుకుతుందేమో అని.

అనసూయ చెప్పినది వింటే అభయనిలయం అమ్మగారికి ఆశ్చర్యంవేసింది; నవ్వొచ్చింది; జాలి వేసింది; ఏమిటీ కుర్రవాని వింత ప్రవర్తన అని ఆశ్చర్యం; ఏమిటీ లోకం పోకడ అని నవ్వు. అయ్యో, ఇంత అమాయకురాలయితే ఎలాగ అని జాలి; కాని ఏం చేస్తుంది?

వారం రోజులపాటు ప్రయత్నం చేసింది—చిన్నవాడి చిరునామా దొరుకుతుందేమోనని. యిదివరలో అతడు పనిచేసిన స్టూడియో పెద్దని అడిగితే, వారం అయి ఉద్యోగం వదులుకుని కుర్రవాడు కనపడ్డంలేదని చెప్పాడు.

అభయనిలయం అమ్మగారి ప్రయత్నాలు కృతకృత్యం కావాలని కోరుతానని ఎంతో సానుభూతి ప్రదర్శించాడు. కాని ఏం లాభం? తోకలాంటిదేనా కనపడితే పాము అటు పోయిందనుకోవచ్చు. ఆ మాత్రం ఆచూకీ లేకుండా కుర్రవాడు మాయమయిపోయాడు. అభయనిలయం అమ్మగారు మాత్రం ఏం చేస్తుంది? "చూడమ్మా అనసూయా, యింక నే చేయగల్గింది లేదు. ఏదో ఈ నాలుగు నెలలూ ఇక్కడ వుండు. పిల్లనో, పిల్లవాణ్ణో యీ దిక్కులేని పిల్లల యింట్లో వదులు. నువ్వు నీ తండ్రిగారియింటికి వెళ్ళు. అదొక్కటే దారి నీకు" అని చెప్పింది.

ఈ నాల్గునెలలూ కానీ చూసుకుందాం; యింత ప్రపంచంలో తలదాచుకోలేకపోతానా అనుకుంది అనసూయ. నాల్గు నెలలూ కళ్ళుమూసి తెరిచేలోపున గడిచిపోయాయి. అనసూయ పండంటిపాపణ్ణి కనలేదు. తనలాగే ఈలోకంలో అష్టకష్టాలుపడే ఆడపిల్లనిమాత్రం కంది. ఎంత వదలాలని లేకున్నా-పాపని వదలక తప్పలేదు. నాన్న! నాన్న యీ పాపనికూడా పెట్టుకుందుకు ఒప్పుకుంటే ?

అమ్మగారు ఏం రాశారో, నాన్న ఆదరా బాదరాగా పరిగెత్తుకు వచ్చాడు. వచ్చిరాగానే తనని కౌగలించుకుని ఏడ్చాడు. ఈ రెండు సంవత్సరాలలో నాన్న మనస్సులో పాతికేళ్ళు పరిగెత్తినట్లుంది. ముఖం ముడతలుపడిపోయి నిరాశతో నిండి కళావిహీనంగా, ఎందుకు యిలా బ్రతకడం అన్నట్లుగా వుంది. అనసూయ హృదయం తరుక్కుపోయింది. కళ్ళముందు ఆనాడు నాన్న కుదిర్చిన సంబంధం, దానికోసం

ఆయన పడ్డ తాపత్రయం, అంతా, నిన్న మొన్నటి సంగతుల్లా కన్పించాయి. అనసూయ విశాలమైన కళ్ళు పశ్చాత్తాపంతో నిండి వర్షించాయి.

"అమ్మాయినేమీ అనకండి. అనీ లాభంలేదు. యింటికి తీసుకువెళ్ళి ఆదరించండి. అంతకంటె మీరు చెయ్యకల్గిందేమీలేదు" అని అమ్మగారు అప్పుడు చెప్తూంటే కాళ్ళకింద భూమి పగిలి తనని మింగేస్తే బాగుండును అనిపించింది అనసూయకి. కాని కథల్లోను, సినిమాల్లోను అలా జరుగుతుందా పిచ్చిగాని. తండ్రీ మారుమాట లేకుండా రైలెక్కించాడు. రైల్లో కూర్చున్న అనసూయ హృదయం గత స్మృతుల తాకిడికి తట్టుకోలేక దడదడలాడింది. యీ రైల్లోంచి నాన్న కునుకుతూన్నప్పుడు దిగి ఎక్కడికేనా పోతే! అంతధైర్యంలేదు. అందుకే జీవితం ఇలా అయింది ... అని తనూ ఓ కునుకు వేయడానికి సిద్ధపడింది అనసూయ...

అనసూయ యిల్లు చేరుకుంటుంది. తల్లి మళ్ళీ నాన్నలాగే తనని కౌగలించుకు ఏడుస్తుంది. తనూ ఏడుస్తుంది. ఇదివరలో యీ అనసూయ ఆ యింటి వెలుగు, యిప్పుడు అనసూయ ఆ యింటినిండా చీకటి నింపింది. చిరునవ్వు తుడిచేసింది. అయినా అనసూయ పశ్చాత్తప్త. ప్రక్షాళిత హృదయ. ఆమె యింక తప్పటడుగు వేయదు. అయినా లాభం!...

* * *

నీ ముఖంలావుంది కథ? రోళ్ళకర్రలాగా అలా దొర్లించేయగానే వాస్తవికమైన కథలా కనిపిస్తుందా అంటూ

అందరూ హేళనచేయవచ్చు. ఏ చిన్నవాడేనా అంత బాధ్యతలు గుర్తించకుండా హృదయస్పందనల కనుగుణంగా, ఎదుటి వ్యక్తిమీద అభిమానం లేకుండా, సంఘం అంటే పిసరంతేనా భయంలేకుండా ప్రవర్తిస్తాడా ! అంటారు. ఒకసారి అలా చేసిన చిన్నవాణ్ణి ఏ యువతేనా మళ్ళీ నమ్ముతుందా ? అబద్ధం-శుద్ధ అబద్ధం అంటారు.

కాని, అంతే జరిగింది. చిన్నవాడు బాధ్యతలు గుర్తెరగక, ఎదుటివ్యక్తిమీద అభిమానం లేక, సంఘం అంటే భయంలేకుండా ప్రవర్తించాడు. ఎదుటి వ్యక్తి ఎటువంటి కుటిలుడో గుర్తుతెచ్చుకోకుండా తిరిగి నమ్మేసింది యువతి.

* * *

గాలికి వంగినగడ్డిపోచలాగే అనసూయ వంగి లేచింది. తిరిగీ వంగినప్పుడు లేచే ధైర్యంలేకపోయింది. ధైర్యం తెచ్చుకొందుకేనా అవకాశం లేకపోయింది. విషచక్రపుటిరుసున పడి గిలగిలలాడే ప్రాణికోటిలో అనసూయ లెందరెందరో వుంటారు అన్నారు. కాని వారికీ తెలియనిది, ఎవరికీ తెలియనిది ఒకటుంది: అదే తాము విషచక్రపుటిరుసున పడి నల్గిపోతున్నామనీ, మానవప్రయత్నం ఎంతున్నా కామం నుండి బయల్పడలేమనీ...తమ జీవిత కారుమేఘాలకి గర్జనలు తప్ప మెరుగంచు అయినా లేదనీ.